ఆంధ్ర కేసరి టంగుటూరి జీవితం భావితరాలకు ఆదర్శం

టంగుటూరి జయంతి వేడుకల్లో కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్

విశాలాంధ్ర-విజయనగరం: ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా పని చేసిన ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం భావి తరాలకు ఆదర్శమని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో టంగుటూరి 154 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. టంగుటూరి ప్రకాశం పంతులు గారి చిత్ర పటానికి పూల మాలలు వేసి జిల్లా కలెక్టర్, సంయుక్త కలెక్టర్ తదితరులు నివాళులర్పించారు. పేదరికం లో పుట్టి , పూట కూళ్ళ లో పని చేస్తూ ఉన్నత విద్యావంతునిగా ,పత్రికా సంపాదకుని గా, ప్రజా నాయకునిగా, స్వాతంత్ర్య సమర యోధునిగా, ముఖ్యమంత్రిగా ఎదిగి, సంపాదించిన దానిని ప్రజలకే పంచి, పేదవానిగా మరణించిన మహా నీయుడని వీరి జీవితం అందరికీ ఆదర్శమని కలెక్టర్ పేర్కొన్నారు. సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్ మాట్లాడుతూ సైమన్ గో బాక్ నినాదం తో బ్రిటిష్ వారికి ఎదురొడ్డి గుండె చూపిన ధైర్యశాలి అని పేర్కొన్నారు. రైతుల కోసం అనేక ప్రోజెక్టుల ను చేపట్టారని, వాటి ఫలాలను రైతులు నేడు అనుభవిస్తున్నారని తెలిపారు. అలాగే విద్యా పరంగా శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయాన్ని స్థాపించి విద్యా వ్యాప్తికి కృషి చేశారని తెలిపారు. యువతకు వారు చూపిన మార్గం ఆదర్శమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ శ్రీనివాస మూర్తి, కలెక్టరేట్ ఏ.ఓ తాడ్డి గోవింద, సి.పి.ఓ బాలాజీ, జిల్లా వ్యవసాయ అధికారి తారక రామారావు, మార్కుఫెడ్ డి.ఎం వెంకటేశ్వర రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా...ప్రకాశం పంతులు 154వ జయంతి

విశాలాంధ్ర-విజయనగరం: టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం ఎందరికో ఆదర్శప్రాయమని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. శనివారం ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 154వ జయంతిని పురస్కరించుకుని నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆయన జయంతి వేడుకలు జరిగాయి. ఆంధ్ర కేసరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, వివిధ విభాగాల అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్న ఈ కార్యక్రమంలో టంగుటూరి ప్రకాశం పంతులు జీవిత విశేషాలను మేయరు విజయలక్ష్మి వెల్లడించారు. ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటులో టంగుటూరి ప్రకాశం పంతులు చూపిన తెగువ మరువరానిదన్నారు. నాటి బ్రిటిష్ పాలకుల సైమన్ కమిషన్ కు వ్యతిరేకంగా పరపాలకుల తుపాకీ గుళ్లకు ఎదురొడ్డి నిలిచిన మహా ధైర్యశాలి టంగుటూరి ప్రకాశం పంతులని కొనియాడారు. నిరుపేద కుటుంబంలో జన్మించి నప్పటికీ ఉన్నత విద్యను అభ్యసించి స్వాతంత్ర పోరాటంలో ఆయన చూపిన పోరాట పటిమ ఆదర్శప్రాయమన్నారు. అటువంటి మహానుభావుల త్యాగనిరతిని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

పి4 కమిటీ సభ్యునిగా ఆళ్ల వెంకటేశ్వరావు

విశాలాంధ్ర-భోగాపురం: స్వర్ణాంధ్ర పి ఫోర్ ఫౌండేషన్ నెల్లిమర్ల నియోజకవర్గ కమిటీ సభ్యునిగా విశ్రాంత ఉపాధ్యాయుడు ఆళ్ల వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలో పి4 పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసి లబ్ధిదారులకు పూర్తి ప్రయోజనాలు అందేలా కృషి చేస్తాన న్నారు. పథకం పురో గతి, వినియోగం, లబ్ధిదారుల ఎంపిక, ప్రజల నుండి వచ్చే సమస్యలు, అభ్యర్థనలు, ఫిర్యాదులపై నిరంతర పర్యవేక్షణ జరిపి, అన్ని వివరాలపై సమగ్ర నివేదికలను చైర్మన్‌కు అందజేస్తానని చెప్పారు.

భీమసింగి కర్మాగారం ఊసే లేదు..!

- గత పాలకుల మాదిరిగా కూటమి సర్కార్...!
- చెరుకు రైతులకు దక్కని భరోసా
- బకాయిలకై కార్మికుల, ఉద్యోగుల ఎదురుచూపులు

విశాలాంధ్ర-జామి: గత పాలకుల నిర్లక్ష్యంతో పూర్తిగా ఖాయిలా పడిన భీమసింగి సహకార చక్కెర కర్మాగారం కొత్తగా వచ్చిన కూటమి సర్కార్ పాలనలో కాస్తయినా మెరుగవుతుందని అందరూ భావించారు. కానీ ఎవరొచ్చినా ఇదే తంతు అనే విదంగా భీమసింగి పరిస్థితి మారిపోయింది. ఒకప్పుడు రాష్ట్రానికే చెరుకు క్రషింగ్‌లో ఆదర్శంగా నిలిచిన భీమసింగి కర్మాగారం నేడు తనవైపు ఎవరూ చూడడం లేదని ఆవేదన చెందే పరిస్థితి ఏర్పడింది. తమకు ఎంతో భరోసా కలుగుతుందని భావించిన చెరుకు రైతులకు మరింత నిరుత్సాహం ఏర్పడింది. ఇక ఏళ్ళ తరబడి విదులు లేక బకాయిలైనా చెల్లించాలని కోరుతున్న కార్మికులు, ఉద్యోగులకు నిరాశే ఎదురయింది.. పలుమార్లు రాష్ట్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖామంత్రి నియోజకవర్గం ఎమ్మెల్యే కొండపల్లి శ్రీనివాస్ వద్దకు వెళ్ళి తమ వేతనాలను, బకాయిలను చెల్లించాలని విన్నవించుకుంటున్నా ఫలితం లేకుండా పోయింది.

కూలిపనుల్లో కార్మికులు.. విస్తీర్ణం తగ్గిన చెరుకు..

ఒకప్పుడు భీమసింగి కార్మికులమని ధర్జాగా తిరిగిన కార్మికులు, ఉద్యోగులు నేడు అనేక కూలి పనుల్లో పనిచేస్తున్నారు. కొందరు చిరువ్యాపారులుగా మారారు. ఎప్పటికైనా తమను గుర్తించకపోతారా అనే ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇక ఒకప్పుడు కర్మాగార కెపాసిటీకి మించి చెరుకు పండించిన రైతులు నేడు చెరుకు సాగుపై పూర్తిగా ఆశలు వదిలేసారు. కర్మాగారం మూసివేయడంతో ప్రోత్సహించేవారు కరువయ్యారు. దీంతో క్రమేపీ చెరుకు పంటకు దూరమై, ఇతర వాణిజ్య పంటలవైపు మొగ్గు చూపిస్తున్నారు. ఫలితంగా పూర్తిగా చెరుకు సాగు పడిపోయింది. లక్షల టన్నులను ఉత్పత్తి చేసిన రైతులు నేడు పదివేల టన్నులను కూడా క్రషింగ్‌కు పంపించని పరిస్థితి ఏర్పడింది.

కొత్త కర్మాగార ఏర్పాటు ఏమయ్యిందో..!

భీమసింగి చక్కెర కర్మాగారంను కొనసాగించలేమని తేల్చి చెప్పిన కూటమి సర్కార్ ప్రత్యామ్నాయ కంపెనీలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. ఇది చెప్పి 18 నెలల పాలన గడిచినా ఎక్కడా భీమసింగి కర్మాగారం ఊసే లేదని స్థానిక రైతులు, ఉద్యోగులు, కార్మికులు వివిద వర్గాల ప్రజలు పెదవి విరుస్తున్నారు. వాస్తవానికి భీమసింగి కర్మాగారం విషయం అసలు ప్రభుత్వం లెక్కలోకి తీసుకోలేదని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు కర్మాగారం సమస్యలను పరిష్కరించాలని, చిత్తశుద్ధితో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఈసమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువళ్ళి పరిష్కరించాలని కోరుతున్నారు.

కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి కి విప్లవ సీపీఐ జోహార్లు

విశాలాంధ్ర-బొబ్బిలి : భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మాజీ పార్లమెంట్ సభ్యులు కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి అకాల మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ శనివారం పట్టణం జండా మహల్ జంక్షన్ వద్ద భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి విప్లవ జోహార్లు అర్పించారు. భారత కమ్యూనిస్టు పార్టీ తరపున భూమి భుక్తి విముక్తి కోసం తెలంగాణ సాయుధ పోరాటంలో అలుపెరగని భూ పోరాటలు చేస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అవలంబిస్తున్న ప్రజా కార్మిక రైతు ఉద్యోగ వ్యతిరేక విధానాల పైన అలుపెరగని ప్రజా పోరాటాలు చేసిన ఘనత కామ్రేడ్ సురావరం సుధాకర్ రెడ్డి కే దక్కిందన్నారు. కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి అకాల మృతి భారత కమ్యూనిస్టు పార్టీకి తీరనిలోటని భారత కమ్యూనిస్టు పార్టీ తరపున సురవరం సుధాకర్ రెడ్డి కుటుంబానికి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ ఘన నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి కొలుసు వెంకట సత్యనారాయణ, ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు తమటాల అప్పలనాయుడు, కార్యదర్శి రాయితీ సత్యం తదితరులు పాల్గొన్నారు.

భీమసింగి పాఠశాలకు పూర్వ విద్యార్థి వితరణ

రూ.30 వేల విలువైన స్పోర్ట్స్ దుస్తులు అందజేత

విశాలాంధ్ర-జామి: మండలంలోని పాత భీమసింగి గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఇదే పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థి గార ఈశ్వరరావు దాదాపు రూ.30 వేల విలువైన స్పోర్ట్స్ దుస్తులను వితరణగా అందజేశారు. ఏ ఆర్ ఎస్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న ఈ ఈశ్వరరావు తన జన్మదినం సందర్భంగా పాఠశాలకు దుస్తులను వితరణగా ఇవ్వాలని నిర్ణయించుకున్నాడు. ఈ మేరకు శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి యు. మాణిక్యాలరావు గ్రామ సర్పంచ్ జొన్నాడ వెంకటలక్ష్మి, టిడిపి పార్టీ ప్రధాన కార్యదర్శి ధనియాల పైడిరాజు చేతుల మీదగా దుస్తులను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా డిఇఓ మాట్లాడుతూ తాను చదువుకున్న పాఠశాలకు ఎంతో కొంత సాయం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్క విద్యార్థి పై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ జయశ్రీ, పాఠశాల హెచ్ఎం కొవ్వాడ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆంధ్ర కేశరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు

విశాలాంధ్ర-మెంటాడ: ఆంధ్ర కేశరి టంగుటూరి ప్రకాశం పంతులు 154వ జయంతి వేడుకలను మెంటాడ మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ అసిస్టెంట్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకాశం పంతులు జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని, దేశ స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గంలో నడవాలని యువతకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొని పంతులుగారికి ఘనంగా నివాళులర్పించారు.

అనుమానస్పద స్థితిలో దంపతులు మృతి..!

ప్రేమించి పెళ్లిచేసుకున్న 8నెలలకే తిరిగిరాని లోకాలకు..

మనస్పర్థలే మరణానికి కారణమా?

విశాలాంధ్ర-కొత్తవలస: విజయనగరం జిల్లా, కొత్తవలస మండలంలోని అప్పన్నదొరపాలెం పంచాయతీ శివారు తమ్మన్నమెరక గ్రామంలో శనివారం దుర్ఘటన వెలుగుచూసింది. అనుమానస్పద స్థితిలో భార్యా, భర్తలు మృతి చెందడం స్థానికంగా కలకలం రేపింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి...కొత్తవలస మండలం, జోడుమెరక గ్రామానికి చెందిన గీతల వెంకటలక్ష్మి(26), వేపాడ మండలం, చిన దుంగాడ(పప్పులవానిపాలెం) గ్రామానికి చెందిన కొప్పల చిరంజీవి(30)లు 8నెలల క్రితం ప్రేమించి.. పెద్దల సమక్షంలో పెళ్లి చేసుకుని తమ్మన్నమెరక వద్దనున్న జగనన్న కాలనీలో తమ నివాసంలో అన్యోన్యంగా జీవిస్తున్నారు. మృతురాలు వెంకటలక్ష్మి కొత్తవలసలోని వెంకటేశ్వర స్టోర్స్ షాపులో కొన్నేళ్లుగా పనిచేస్తుందని, మృతుడు చిరంజీవి రామవరం వద్దనున్న ఓ ప్రయివేటు కంపెనీలో పనిచేస్తున్నాడని తెలిపారు. ఎప్పటిలాగే శుక్రవారం రాత్రి విధులు ముగించుకుని భార్యాభర్తలిద్దరూ ఇంటికి చేరారని, తెల్లారేసరికి ఇద్దరూ అనుమానస్పద పరిస్థితిలో ఇంట్లో విగతజీవులుగా పడిఉండటంతో బంధువులు, స్థానికులు విస్తుపోయారు. ఘటనాస్థలంలో కిందపడి ఉన్న వెంకటలక్ష్మి మృతదేహం, ఆమె మెడలోని ఆభరణాలు, గాజులు తెగిపడటం, చిందరవందరగా ఇంట్లోని వస్తువులు, మృతుడు చిరంజీవి కాళ్ళు నేలకు తగులుతున్నట్లున్నటువంటి దృశ్యాలు ఇద్దరిమధ్య పెనుగులాట జరిగిందా, ఇంకేదైనా జరిగి ఉంటుందా అన్న పలు అనుమానాలకు తావిస్తున్నాయని స్థానికులు భావిస్తున్నారు. ఘటనపై పోలీసులకు సమాచారం అందించడంతో సిఐ షణ్ముఖరావు, ఎస్సై ప్రసాదరావులు దర్యాప్తు చేపట్టారు. మృతికి గల కారణాలను వివిధ కోణాల్లో విచారణ ప్రారంభించామని, మరిన్ని వివరాలు తెలియాల్సి ఉందని సిఐ వెల్లడించారు. పెద్దల అంగీకారంతో పెళ్లి చేసుకుని హాయిగాజీవిస్తున్న వీరిమధ్య మనస్పర్థలేమైనా ఉన్నాయా.. మరే కారణం చేతనయినా ఆత్మహత్యకు పాల్పడ్డారా అనే కోణంలో దర్యాప్తు చేపట్టినట్లు సిఐ పేర్కొన్నారు. సంఘటనతో అప్పన్నదొరపాలెం, జోడుమెరక, తమ్మన్నమెరక గ్రామ ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. విషాదంతో రెండు కుటుంబాలకు చెందిన బంధువులు రోదిస్తున్నారు.

సీతం ఎన్ఎస్ఎస్ యూనిట్ వర్షాకాల పరిశుభ్రతపై స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: సీతం ఎన్ఎస్ఎస్ యూనిట్ (90214208) వర్షాకాల పరిశుభ్రతపై దృష్టి సారించి "స్వచ్ఛ ఆంధ్ర-ప్రతి నెల 3వ శనివారం" ప్రచారాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో డ్రెయిన్ శుభ్రపరచడం, నీటి స్తబ్ధతను నివారించడం, కాలానుగుణంగా వచ్చే అంటువ్యాధులను తగ్గించడంపై అవగాహన చేపట్టారు. జిల్లా ఎన్ఎస్ఎస్ నోడల్ ఆఫీసర్ ఎన్. సతీష్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎన్.వి.ఎస్. రాజు వర్షాకాలంలో పరిశుభ్రత పరిశుభ్రతను కాపాడుకోవడం యొక్క ప్రాముఖ్యతను చెబుతూ పాల్గొన్న వారందరికీ ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ ఎం. శశిభూషణరావు మాట్లాడుతూ, సీజనల్ ఆరోగ్య సమస్యలనునివారించడంలో విద్యార్థులు, అధ్యాపకులు అవగాహన కల్పించుకుని చురుకైన భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొన్నారు, వారు శుభ్రపరిచే కార్యకలాపాలు మరియు అవగాహన డ్రైవ్‌లో చురుకుగా పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులలో పేరుకే ఫస్ట్ ఎయిడ్ బాక్సులు

విశాలాంధ్ర-బొబ్బిలి: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రవాణా శాఖ నడపబడు తున్న ఆర్టీసీ బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్స్ నామమాత్రంగానే ఉంటున్నాయి. ప్రమాదాల జరిగే సమయంలో ఫస్ట్ ఎయిడ్ బాక్స్ లో ప్రయాణికులకు అవసరమైన కొన్ని రకాల మందులు ఉంచాలి. కానీ ఆర్టీసీ బస్సులలో ఫస్ట్ ఎయిడ్ బాక్సులు అలంకార ప్రాయంగా కనబడుతున్నాయి. ఫస్ట్ ఎయిడ్‌బాక్స్ లో ఇటువంటి మందులు ఉండడం లేదు. బాక్సులకు తాళాలు ఉండటం లేదు. రోడ్డు ప్రమాదాలు జరిగితే ఆ బస్సులో ప్రయాణం చేసే ప్రయాణికులు ఫస్ట్‌ఎయిడ్ బాక్స్ ఎంతో ఉపయోగంగా ఉంటుంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న ఆర్టీసీ బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లో ప్రథమ చికిత్సకు అవసరమైన మందుల్లో ఉండే విధంగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

చొల్లంగిపేట రైతుసేవ కేంద్రంలో యూరియా పంపిణీ

విశాలాంధ్ర-డెంకాడ: డెంకాడ మండలంలో చొల్లంగిపేట రైతుసేవ కేంద్రం లో యూరియా పంపిణీ జరిగింది. ఈ ప్రక్రియను మండల రెవెన్యూ అధికారి ఎం.రాజారావు, మండల వ్యవసాయ అధికారిని టి.సంగీత పోలీస్ శాఖ కలిపి జాయింట్ గా తనిఖీ జరిగింది. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులకు కొన్ని సూచనలు ఇవ్వడం జరిగింది. ఒక రైతుకు ఒక బస్తా మాత్రమే ఇవ్వాలని సూచించారు. అవి ఇచ్చేటప్పుడు రైతుకు సంబంధించిన వన్‌బి ఆధార్ నెంబర్ తీసుకుని ఇవ్వాలని తెలిపారు. పంపిణీకి సంబంధించిన రిజిస్టర్‌లో నమోదుచేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి ఎం.రాజారావు, మండల వ్యవసాయ అధికారిని టీ.సంగీత, వ్యవసాయ విస్తరణ అధికారి బి.రామకోటి, గ్రామ సర్పంచ్ కోరాడ కనకరాజు గ్రామ వ్యవసాయ సహాయకులు శాలిని, పోలీస్ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యత

కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

విశాలాంధ్ర-డెంకాడ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రజల సామాజిక బాధ్యత అని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అన్నారు. డెంకాడ మండలం పినతాడివాడలో శనివారం జరిగిన స్వర్ణాంధ-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. స్వచ్ఛాంధ్ర సాధనకు కలిసికట్టుగా కృషి చేస్తామని సభికులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. గ్రామంలో నిర్వహించిన అవగాహనా ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామాల పరిశుభ్రత, స్వచ్ఛతే స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతీ 3వ శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రజల్లో చైతన్యం కల్గించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రతీ నెలా ఒక్కో అంశాన్ని తీసుకోవడం ద్వారా అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన నివారణా చర్యలపై ఈ నెల అంశంగా తీసుకొని అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. నీటి ద్వారా వచ్చే వ్యాధులు, ఇతర కారకాలద్వారా వచ్చే వ్యాధులు వేర్వేరుగా ఉంటాయని, వాటిని నివారించేందుకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. వ్యక్తిగత, ఇంటి పరిశుభ్రతతోపాటు సామాజిక పరిశుభ్రత కూడా చాలా అవసరమని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతీఒక్కరి బాధ్యతని చెప్పారు. ఆ దిశగా ప్రతిఒక్కరూ చిత్తశుద్ధితో కృషి చేసి స్వచ్ఛగ్రామాలను రూపొందించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. గ్రామానికి చెందిన గ్రీన్ అంబాసిడర్లను సన్మానించారు. ఫాగింగ్ మిషన్లను వినియోగించడంపై ప్రతీ గ్రామ పంచాయితీలో శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఈఓ బివి సత్యనారాయణ, డిపిఓ మల్లికార్జునరావు, డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ ఎస్.జీవనరాణి, ఎంపిపి బి.వాసుదేవరావు, ఎమ్మార్వో రాజారావు ఎంపీడీవో వై.భవాని, వ్యవసాయ అధికారి టి సంగీత ఈఓపిఆర్‌డి శ్రీనివాసరావు, మెడికల్ ఆఫీసర్ రామకృష్ణ, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్, ఎంపిటిసి అచ్చెన్నాయుడు, సర్పంచ్ లెంక లక్ష్మణరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టించాలి

ఇంచార్జ్ ఎంపీడీఓ రవికుమార్

విశాలాంధ్ర-వేపాడ: స్వచ్ఛ గ్రామాల ధ్యేయంగా పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని ఇన్చార్జ్ ఎంపీడీఓ రవికుమార్ అన్నారు. మండలంలోని చిన గుడిపాల గ్రామంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ఇంచార్జ్ ఎంపీడీఓ రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అలాగే గ్రామంలోని పంచాయతీ భవనం నుండి రామాలయం వరకు,ర్యాలీ,నిర్వహించారు, గ్రామంలో డ్రైనేజీ కాలవలను పరిశీలించారు.కాలువలో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శికి గంగాధర్ కు సూచించారు. ఇంటింటికి వెళ్లి తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా ఇవ్వాలని ప్రజలకు సూచించారు.సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకూడదని దుకాణదారులకు సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని బహిరంగ మల విసర్జన చేయకూడదని ప్రజలకు సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బోజంకి రామనాయుడు, ఎంఈఓ బాల భాస్కరరావు, వెలుగు ఏపిఎం డి.సూర్యనారాయణ,జిల్లా రిసోర్స్ పర్సన్ ఖాన్ , స్వచ్ఛభారత్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్ గొర్లె రాంబాబు, పంచాయతీ కార్యదర్శిలు గంగాధర్,కన్నం నాయుడు, వైద్య సిబ్బంది,క్లాప్ మిత్రాలు గ్రామస్తులు పాల్గొన్నారు.

జిల్లా యువకుడికి జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్

విశాలాంధ్ర-విజయనగరం: ఝార్కండ్ రాష్ట్రంలో జరిగిన జంషెడ్ పూర్ స్టేట్ నేషనల్ సీనియర్స్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ - 2025 పోటీలలో విజయనగరానికి చెందిన శీల రామకృష్ణ అనే యువకుడు పాల్గొని జిల్లా గర్వించే విధంగా సంచలన ప్రదర్శన చేసాడు. విజయనగరం జిల్లా పరిషత్ లో కంప్యూటర్ ఆపరేటర్ గా పని చేస్తున్న రామకృష్ణ ఈ నెల 18 నుంచి 21 వరకు ఝార?ండ్ లో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీలలో పాల్గొని 550 కేజీలు బరువు ఎత్తి గోల్డ్ మెడల్ సాధించాడు. విజయనగరానికి చెందిన వ్యక్తి జాతీయ స్థాయి పోటీలలో గోల్డ్ మెడల్ సాధించడంపై జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించడానికి ప్రభుత్వం సహాయం చేయాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా శనివారం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు (చిన్న శ్రీను), జడ్పీ సీఈవో బీవీ సత్యనారాయణ లు రామకృష్ణను అభినందించారు.

పేదరికాన్ని జయించి ఉపాధ్యాయుడిగా రాంబాబు

విశాలాంధ్ర-మెంటాడ: పట్టుదలతో కష్టపడి చదివితే ఎలాంటి పరిస్థితు ల్లోనైనా విజయం సాధించవచ్చునని విజయానికి పేదరికం అడ్డుకాదని నిరూపించాడు గుర్ల తమ్మిరాజుపేట గ్రామానికి చెందిన చింతాడ రాంబాబు. రాష్ట్రవ్యాప్తంగా వెలువడిన మెగా డీఎస్సీ ఫలితాలలో రాంబాబు ఉపాధ్యాయునిగా ఎంపిక కావడం అనేకమందికి ఆనందాన్ని ఆశ్చర్యాన్ని కలుగజేసింది. గుర్ల తమ్మిరాజుపేట గ్రామానికి చెందిన చింతాడ బుచ్చిబాబు రాంబాబు తండ్రి కూలి పనులు చేసుకుంటూ రోజువారి కూలితోనే కుటుంబాన్ని పోషిస్తూ తన కుమారుడి చదువుకు ఎటువంటి ఆటంకమూ కలుగకుండా ఉన్నత స్థానానికి చేర్చాలనె దృఢ సంకల్పంతో రాత్రులు పగలు కష్టపడి అనేక సమస్యలు ఎదుర్కొంటూ కుమారునికి అండగా నిలబడి నేడు కుమారుడు ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సంపాదించుకొనుటకు ముఖ్య కారకుడయ్యాడు. తండ్రి కష్టాన్ని స్ఫూర్తిగా తీసుకున్న రాంబాబు చదువులో తన ప్రతిభను కనబరుస్తూ నేడు ఎస్ జి టి 69.5 మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉపాధ్యాయునిగా ఎంపిక కావడం గ్రామంలోని హర్షత్ రేకాలు వెలువడ్డాయి. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ సర్పంచ్ చొక్కాకు పైడిరాజు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చలుమూరి వెంకట్రావు మాజీ వైస్ సర్పంచ్ చొక్కాకు సన్యాసి నాయుడు,పెద్దలు, గ్రామ యువతీ యువకులు రాంబాబు విజయం పై అభినందనలు వ్యక్తం చేశారు.

స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కోసం ఐక్యంగా కృషిచేద్దాం..

ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

విశాలాంధ్ర-లక్కవరపుకోట: స్వర్ణాంధ్ర... స్వచ్ఛ ఆంధ్ర కోసం ఐక్యంగా ఉందామని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. శనివారం మండలంలోని గనివాడ గ్రామంలో ప్రతి నెలలో 3వ శనివారం జరుగు స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఈ కార్యక్రమం ఎక్కడికి అక్కడ వ్యర్థ పదార్థాలను సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆమె పిలుపునిచ్చారు. రోడ్డుపై నిలిచిన మురుగునీటిని బురదను పంచాయతీ కార్మికులతో కలిసి స్వయంగా శుభ్రం చేశారు. ప్రతి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని తద్వారా వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవచ్చని తెలిపారు. గ్రామంలో గ్రామస్తులతో, సచివాలయ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. రాష్ట్ర ప్రజల్లో మార్పును తీసుకువచ్చే విధంగా గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని ఆమె తెలిపారు. గ్రామాల్లో పరిశుభ్రతను మెరుగుపరచడమని ప్రతి గ్రామంలో ప్రజలు భాగస్వాములు అవ్వాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ మల్లా రామకృష్ణ, కొత్తవలస ఏఎంసీ చైర్మన్ చొక్కాకుల మల్లు నాయుడు, ఎల్కోట మాజీ జడ్పిటిసి సభ్యులు ఈశ్వరరావు, ఎంపీడీవో ఎన్ అప్పారావు, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు..

సీతంలో స్టార్టప్‌ల ప్రదర్శన దినోత్సవం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: స్థానిక గాజులరేగ పరిధిలో గల సీతం కళాశాలలో స్టార్టప్‌ల ప్రదర్శన దినో త్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి హాజరైన వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు ఎంబెడెడ్ సిస్టమ్స్, ఐఓటి ఎలక్ట్రానిక్స్‌లో కొత్త ఆలోచనలతో 15 డిజైన్‌లను తయారు చేశారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి.రామమూర్తి స్టార్టప్‌లను పర్యవేక్షించడానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి డిజైన్ యొక్క విధానం మరియు ఆలోచనలను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్‌లో డిమాండ్ ప్రకారం, విద్యార్థులు సీతంలోని ఇంక్యుబేషన్ సెంటర్‌లో తమ ఆలోచనలను ఆవిష్కరించవచ్చు మరియు అమలు చేయవచ్చు అని ఇ.సి.ఇ విభాగాధిపతి డాక్టర్ టి. డి. వి. ఎ. నాయుడు ఈ సందర్భంగా విద్యార్థులకు తెలియజేశారు.ఈకార్యక్రమంలో ఇతర అధ్యాపకులు , విద్యార్థులు పాల్గొన్నారు.

వీఆర్వోని సస్పెండ్ చేయాలి : రైతు సంఘం నాయకులు

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్: విజయనగరం కలక్టరేట్ వద్ద బోండపల్లి మండల మరువాడ కొత్తవలస గ్రామ రైతులు ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో నిరశన చేశారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్కి వినతిపత్రాన్ని అందజేశారు. వీఆర్వో, మండల రెవెన్యూ అధికారులు మ్యుటేషన్, జాయిన్ ఐపీఎం తదితర సమస్యలు పరిష్కారానికి సెంటుకి 300 చొప్పున 40 మంది రైతులు వద్ద డబ్బులు మరియు ఫోన్ పే రూపంలో తీసుకొని పని చేయకుండా తిప్పుతున్నందున రైతుసంఘం ఆధ్వర్యంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కలవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వీఆర్వోని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా కార్యదర్శి బి. రాంబాబు, కొత్తవలస సర్పంచ్ కర్రోతు శ్రీను, అప్పలరాజు, మాధవ పాల్గొన్నారు.

తెల్లదొరలను హడలెత్తించిన తెలుగుతేజం

ప్రకాశం పంతులు డాక్టర్ డివిజి శంకర్రావు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: గాంధీజీ పిలుపుతో మద్రాసు నుంచి స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రకాశం పంతులు తెల్ల దొరలను హడలెత్తించారని ఎస్టీ కమిషన్ పూర్వ చైర్మన్ ,మాజీ ఎంపీ డాక్టర్ డివిజి శంకర్రావు పేర్కొన్నారు . తెలుగు భాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గురజాడ పాఠశాలలో ఏర్పాటుచేసిన టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ నేటి విద్యార్థులు టంగుటూరి ప్రకాశం ను స్ఫూర్తిగా తీసుకొని పట్టుదలతో అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని పిలుపునిచ్చారు .తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షులు సముద్రాల గురు ప్రసాద్ మాట్లాడుతూ 'నాది అనేది నాకు ఉండకూడదు' అనే సిద్ధాంతాన్ని స్వీకరించి ఆజన్మాంతమూ నూటికి నూరు పాళ్ళూ అచరించిన కర్మయోగి అని ,తన దీక్షలో విధి నిర్వహణలో పట్టింపువచ్చెనా... బ్రహ్మంతటి వాడినైనా నిలదీయగల ధీశాలి టంగుటూరి అని అభివర్ణించారు .కార్యక్రమంలో ముందుగా టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు .ఈ సమావేశంలో గురజాడ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పూడి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అంటువ్యాధులు వ్యాప్తి కాకుండా తగిన చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-రేగిడి: వర్షాకాలం లో అంటువ్యాధులు వ్యాప్తి కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎంపిడిఓ డి. నాగమణి కోరారు.శనివారం మండలం లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర లో భాగంగా వర్షాకాల పరిశుభ్రత అనే అంశం పై గ్రామాల్లో చేపట్టవలసిన కార్యక్రమాలు గురించి మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మంచి నీటి వనరులు సంరక్షణ కు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు కు గ్రామాల్లో ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకారం అందించాలన్నారు.గ్రామాల్లో మురుగునీటిని, చెత్తని ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. యాంటీ లార్వా ఫాగింగ్ చేపట్టాలన్నారు. ఆరోగ్య శాఖ తో సమన్వయం చేసుకొని అంటువ్యాదులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని గ్రామ కార్యదర్శులను ఆదేశించారు. ఈ సందర్భంగా మానవ హారం, ర్యాలీ, ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమం లో వైస్ ఎంపీపీ వావిలపల్లి జగన్మోహన్ రావు, ఎమ్ఈఓ వరప్రసాదరావు,జె ఈ జి శ్రీచరణ్,స్వచ్ఛ భారత్ మండల కో ఆర్డినేటర్ పద్మ, ఏపిఓ హరనాథ్, కిషోర్,బాబురావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బొబ్బిలి ప్రధాన పోస్టాఫీస్ లో ఇండియన్ పోస్టల్ ఆర్డర్ విక్రయాలు చేయక ప్రజలు తీవ్ర ఇబ్బందులు

విశాలాంధ్ర-బొబ్బిలి: ఇండియన్ పోస్టల్ అధికారులు నిర్లక్ష్యంతో ప్రభుత్వానికి రావలసిన ఆదాయానికి గండిపడుతుంది. పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో పోస్టల్ స్టాంపులతోపాటు ఇండియన్ పోస్టల్ ఆర్డర్ అమ్మకాలు చేస్తారు. పోస్టల్ ఆర్డర్లో అమ్మకాలతో 20, రూపాయలు పోస్టల్ ఆర్డర్ వినియోగదరుడు కొనాలంటే 20 రూపాయలతో పాటు మరో ఐదు రూపాయలు కమిషన్ వసూలుచేస్తారు. గత కొంతకాలంగా బొబ్బిలి ప్రధాన హెడ్ పోస్టాఫీసులో ఇండియన్ పోస్టల్ ఆర్డర్ అమ్మకాలు చేయక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇండియన్ పోస్టల్ ఆర్డర్ ఐపీఓలు సమాచార హక్కు చట్టం కోసం సమాచారం ఇవ్వడానికి సంబంధిత శాఖ అధికారులు ప్రధానంగా ఇండియన్ పోస్టల్ ఆర్డర్ 10 20 50,100 ఐదు రూపాయలు కమిషన్‌తో పోస్టల్ శాఖ సిబ్బంది అమ్మకాలు చేస్తారు. బొబ్బిలి హెడ్ పోస్ట్ ఆఫీస్ లో గత కొంతకాలంగా సాఫ్ట్వేర్ లోపం ఉందని సంబంధిత ఉన్న అధికారులు సాఫ్ట్వేర్ లో ఉన్న లోపాలను సరి చేయడం లేదని దీంతో మేము పోస్టల్ ఆర్డర్లు అమ్మకాలు చేయడం లేదని కింది స్థాయి సిబ్బంది విశాలాంధ్ర విలేఖరికి తెలిపారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి బొబ్బిలి హెడ్ పోస్ట్ ఆఫీస్ లో ఇండియన్ పోస్టల్ ఆర్డర్ అమ్మకాలు జరిగే విధంగా చర్యలు తీసుకుని ప్రజా సమస్యల పరిష్కారం చేయాలని పలువురు ప్రజలు కోరుతున్నారు.

గురజాడ ప్రతిష్టను రాష్ట్ర ప్రభుత్వం కాపాడాలి : భీశెట్టి

ముఖ్యమంత్రి కి ఉప ముఖ్యమంత్రి కి లేఖలు రాసిన పౌర వేదిక ప్రతినిధులు

విశాలాంధ్ర-విజయనగరం రూరల్ : తెలుగు సాహిత్య రంగంలో తనకంటూ చెరగని ముద్ర వేసిన మహోన్నత వ్యక్తి కన్యాశుల్కం సృష్టికర్త మహాకవి గురజాడ అప్పారావు ప్రతిష్టను (గృహాన్ని) గురజాడ రచించిన రచనలను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధతో కాపాడేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి కోరారు. శనివారం గురజాడ జిల్లా గ్రంథాలయం వద్ద ముందుగా స్వాతంత్ర్య సమరయోధుడు ఆంధ్ర రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ప్రకాశం పంతులు 153 వ జయంతి కార్యక్రమం నిర్వహించి పోస్టు కార్డుల ఉద్యమం ప్రారంభించారు ఈ సందర్భంగా భీశెట్టి మాట్లాడుతూ గురజాడ ఇంటిలో ఆగస్టు 11న ఒక తాగుబోతు చొరబడి అక్కడ సాహిత్య పుస్తకాలను,సీలింగ్ ఫ్యాన్లను,టేబుళ్లను చిందరవందర చేస్తే ఎమ్మెల్యేలు, మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వం లో కనీసం చలనం లేకపోవడం చాలా బాధ కలిగిందని ఆవేదన వ్యక్తంచేశారు, జరిగిన దుచ్చర్య ను తెలుసుకున్న దేశవ్యాప్త గురజాడ అభిమానులు పాలకుల నిర్లక్ష్యంపై మండిపడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో పురావస్తు శాఖ గురజాడ గృహాన్ని కాపాడటంలో పూర్తిగా విఫలమైందని, ఎవరు అధికారంలో ఉన్నా గురజాడ అప్పారావు గృహానికి, సాహిత్యానికి తీరని అన్యాయం జరుగుతూనే ఉందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పౌర వేదిక నుండి పోస్టు కార్డుల ఉద్యమం ప్రారంభించామని, యువ పెద్దఎత్తున తరలివచ్చి లేఖలు రాస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పౌరవేదిక కార్యనిర్వాహక అధ్యక్షుడు పిడకల ప్రభాకరరావు, ప్రధాన కార్యదర్శి జలంత్రి రామచంద్ర రాజు, తుమ్మగంటి రామ్మోహన్ రావు, జక్కు రామకృష్ణ, గురజాడ ఇందిర, సుభద్ర దేవి, జయపాల్, దివాకర్, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీలో బాడాం యువత ప్రతిభ

విశాలాంధ్ర-మెరకముడిదాం: మండలంలో కొండలావేరు పంచాయతీ మధుర గ్రామ బాడాం కి చెందిన రెడ్డి సత్యనారాయణ కుమార్తె రెడ్డి మహాలక్ష్మి ప్రస్తుతం విశాఖ జిల్లా భీమలి నియోజకవర్గం మధురవాడ జోన్ టు పీఎం పాలెం ఎం పి యు పి స్కూల్ లక్ష్మి వాని పాలెంలో గతంలో చదివిన రెడ్డి మహాలక్ష్మి గత ఏడాది తెలంగాణ డీఎస్సీ హిందీ లో నెంబర్ వన్ ర్యాంక్ సాధించి సీతాఫల్ మండీ గవర్నమెంట్ హై స్కూల్ లో చేరి ఒక ఏడాది సర్వీస్ కూడా పూర్తి చేశారు. కూటమి ప్రభుత్వం గెలిచిన తర్వాత నిర్వహించిన డీఎస్సీ లో విశాఖపట్నం జిల్లాలో ఆమె డీఎస్సీ రాసింది. ఆ డీఎస్సీ ఫలితాలలో రెడ్డి మహాలక్ష్మి హిందీలో స్కూల్ అసిస్టెంట్ -2 ర్యాంక్, పిజిటి -5 ర్యాంక్, టిజిటి -8 ర్యాంక్ సాధించారు. 3 ర్యాంకులు సాధించినందుకు ఆనందంగా ఉందని ఆమె తెలిపారు. తెలంగాణ నుంచి సొంత జిల్లా లో డీఎస్సీ ఫలితాలలో విజయం సాధించినందుకు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు . మహాలక్ష్మిని గ్రామ పెద్దలు, యువత అభినందించారు.

సీతం లో ముగిసిన బి.ఐ.ఎమ్. కార్యశాల

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : స్థానిక గాజులరేగ పరిధిలో గల సీతం కళాశాలలో , సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఆగస్టు 18 నుండి 23 వరకు నిర్వహించిన ఐదు రోజుల బిల్డింగ్ ఇన్ఫర్మేషన్ మోడలింగ్ (బి.ఐ.ఎమ్) శిక్షణా కార్యశాల విజయవంతంగా ముగిసింది. ఈ కార్యశాల విశాఖపట్నం కు చెందిన ఎయిమ్ అప్స్కిల్ టెక్నాలజీస్ సహకారంతో నిర్వహించగా నిపుణులు రంజిత్, శేషగిరిరావు విద్యార్థులకు ప్రత్యేక సబ్జెక్ట్ సెషన్లను నిర్వహించారు. సిద్ధాంతపరమైన అవగాహనతో పాటు ల్యాబ్ ప్రాక్టికల్స్‌ను సమన్వయం చేస్తూ నిర్వహించిన ఈ శిక్షణలో రెవిట్, టెక్లా స్ట్రక్చర్స్ వంటి బి.ఐ.ఎమ్ సాఫ్ట్‌వేర్‌లపై విద్యార్థులు ప్రాయోగిక నైపుణ్యాన్ని పెంపొందించుకున్నారు. బి.ఐ ఎమ్. యొక్క మూల సూత్రాలు, ప్రముఖ బి.ఐ.ఎమ్ సాధనాల వినియోగం, నిర్మాణ రంగంలోని వాస్తవ ప్రాజెక్టులకు అవసరమైన సన్నద్ధత ఈ శిక్షణలో ప్రధానాంశాలుగా నిలిచాయి. చివరి రోజు నిర్వహించిన పరీక్షలో ప్రతిభ కనబరిచిన ఐదుగురు విద్యార్థులకు బహుమతులు అందజేయగా, కార్యశాలను విజయవంతంగా పూర్తి చేసిన వారికి ముఖ్య అతిథుల చేతులమీదుగా సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.ముగింపు సమావేశంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు విజేతలను అభినందించి, వారితో భవిష్యత్తు లక్ష్యాలపై చర్చించారు. సొంత లక్ష్యాలను ఏర్పరుచుకొని సమయపాలనతో సాధించేందుకు ఈ శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాలను వినియోగించుకోవాలని సూచించారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి. రామమూర్తి మాట్లాడుతూ, విద్యార్థులకు బి.ఐ.ఎమ్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిచయం చేయడంలో ముందడుగు వేసిన ఎయిమ్ అప్స్కిల్ టెక్నాలజీస్ కు ధన్యవాదాలు తెలియజేసారు.సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ జి. రవికిషోర్ మాట్లాడుతూ ఎయిమ్ అప్స్కిల్ టెక్నాలజీస్ నిపుణులకు, సీతం యాజమాన్యానికి, కార్యక్రమం విజయవంతం చేయడానికి సహకరించిన అధ్యాపకులుకు కృతజ్ఞతలు, విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

కొత్త మద్యం బార్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

ఎక్సైజ్ శాఖ సిఐ పామోటి చిన్నమనాయుడు



విశాలాంధ్ర-బొబ్బిలి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాబోయే మూడు సంవత్సరాలకు కొత్తగా బారు పాలసీని ప్రకటించిందని. దీనిలో భాగంగా బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలో నాలుగు కొత్త బార్లకు దరఖాస్తులు ఆహ్వానం పలుకుతున్నట్లు సిఐ పామోటి తెలిపారు. ఈ దరఖాస్తులు ఈనెల 18 నుండి దరఖాస్తు దాఖలు చేసుకోవచ్చనని చివరి తేదీ ఈనెల 26 సాయంత్రం ఐదు గంటల వరకు తీసుకుంటారని. అప్లికేషన్ ఫీజు 5 లక్షల రూపాయలు ఇది తిరిగి ఇవ్వబడదని. బార్లకు సంబంధించిన అప్లికేషన్స్ విజయనగరం పట్టణంలో గల కలెక్టరేట్ వద్దగల జిల్లా ప్రొ హిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి(ఈఎస్ ఆఫీసు) వారి కార్యాలయంలో స్వీకరించబడును.ఒక సంవత్సరానికి లైసెన్స్ ఫీజు 55 లక్షలు. ఒక వ్యక్తి ఎన్ని అప్లికేషన్లు అయినా వేయవచ్చును. లాటరీ ఈనెల 28న విజయనగరంలో నిర్వహించబడును. లాటరీలో సెలెక్ట్ అయిన వ్యక్తి ఈ బారును మూడు సంవత్సరాలు పాటు వ్యాపారం నిర్వహించు కోవచ్చునని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ పామోటి చిన్నమనాయుడు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికీ గాయాలు

విశాలాంధ్ర-గుర్ల: మండలంలో గుజ్జింగివలస గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గూడెం గ్రామం నుంచి అచ్యుతాపురం వెళుతున్న రెడ్డి లక్ష్మణరావు,అప్పన్నకు తీవ్ర గాయాలయ్యాయి వీరు బైక్ మీద వెళుతుండగా ఎదురుగా చీపురుపల్లి నుంచివస్తున్న టాటా ఏసీ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది ఒకేసారి ఎదురెదురుగా వెళ్లిపోవడంతో అదుపుతప్పి ప్రమాదం సంభవించినట్లు స్థానికులు తెలిపారు అయితే వెంటనే 108 వాహనం వచ్చి వీరిని విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు ప్రస్తుత ఇద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో వైద్యం అందజేస్తున్నారు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిణి జాగాన విజయలక్ష్మి ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛభారత్ కు విశేష స్పందన

విశాలాంధ్ర-బొబ్బిలి: ఐసీడియస్ ప్రాజెక్టు అధికారిణి జాగాన విజయలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ప్రాంగణంలో సిబ్బంది తో చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర. స్వచ్ఛ భారత్ కార్యక్రమంకు విశేష స్పందన లభించింది. స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛభారత్ మాన్సున్ హైజిన్ కార్యక్రమం లో భాగంగా కార్యాలయం ఆవరణలో పిచ్చి మొక్కలు తొలగించడం. ఖాళి సీసాలు.డబ్బాలు. తీయడం.కార్యాలయం ఆవరణ అంతా శుభ్రపరచడం జరిగింది. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్స్. ప్రభావతి. రాజు. శుభలక్ష్మి. పద్మ. మరియు రూరల్ అంగన్వాడీ హెల్పర్స్ పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సర్పంచ్

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో కోనాయి వలస గ్రామ పంచాయతీ లో ప్రభుత్వ అధికార స్వచ్ఛాంధ్రా కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ బోడెల విజయబాబు, సెక్రటరీ కిల్లాడా మధు సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది,హెల్త్ సిబ్బంది, గ్రీనాంబెస్డర్స్ గ్రామ యువత పాల్గొన్నారు. వీధుల్లో బావిలో బి సింగు ఫినాయిల్ కొట్టి గ్రామం అంతటా పరిశుభ్రంగా ఉంచాలని రోగాల బారిన పడకన్న ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని సర్పంచ్ విజయబాబు ఒక పెగటంలో విలేకరితో తెలిపారు.

స్వీయ నియంత్రణ, సానుకూల దృక్పథం పోలీసు వృత్తిలో కీలకం

సీనియర్ సైకాలజిస్ట్ దా.సూర్యనారాయణ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: ప్రముఖ సైకాలజిస్ట్, సెంట్రల్ ట్రైబల్ యూనివర్శిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పరిపాలనాధికారి డా. ఎన్.వి.ఎస్. సూర్యనారాయణ, శనివారం పోలీస్ ట్రైనింగ్ కాలేజ్, విజయనగరంలో వ్యక్తిత్వ వికాసంపై ట్రైనర్స్ ఆఫ్ ట్రైనర్స్ కార్యక్రమంలో భాగంగా శిక్షణ ఇచ్చారు.ఈ శిక్షణ ప్రత్యేకంగా పోలీస్ ట్రైనర్స్ కోసం నిర్వహించబడిందని, వీరు తదుపరి కొత్తగా నియమించబడిన పోలీస్ కానిస్టేబుళ్లకు ఈ శిక్షణ మాడ్యూల్స్‌ను అందించనున్నారని తెలిపారు. దీనిలో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్, ప్రత్యక్ష ఉదాహరణలు, ఇంటరాక్టివ్ ఆక్టివిటీస్ ద్వారా వ్యక్తిత్వ వికాసంలోని పలు అంశాలను వివరించారు. ముఖ్యంగా స్వీయ నియంత్రణ, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, భావోద్వేగ ప్రజ్ఞ, సానుకూల దృక్పథం, నాయకత్వ లక్షణాలు, ఒత్తిడి నిర్వహణ వంటి అంశాలను ప్రాముఖ్యతతో వివరించారు. శిక్షణ కార్యక్రమంలో పీటీసీ అధికారులు, సీఐలు, ఎస్ఐలు మరియు వివిధ హోదాలలో ఉన్న పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

నారాయణ పాఠశాలలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ్ ఆంధ్ర కార్యక్రమం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : స్థానిక గాజులరేగలో ఉన్న నారాయణ పబ్లిక్ పాఠశాలలో శనివారం స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్రకార్యక్రమం లో భాగంగా పాఠశాల విద్యార్థులకు హేండ్ వాస్"పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హేండ్స్ చేసే విధానం వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ మొయిద నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులు భోజనం కి ముందు భోజనం తర్వాత కచ్చితంగా చేతులు పరిశుభ్రంగాకడుక్కోవాలన్నారు. రోజుకు 6 పర్యాయాలు వాస్ చేయాలన్నారు. విద్యార్థులు హేండ్స్ వాస్ చేయడం వలన అనేక వ్యాధులు రాకుండాఉండి ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యాసనపై ప్రత్యేక దృష్టిపెట్టాలి : ఎంఈఓ



విశాలాంధ్ర-వేపాడ: ఉపాధ్యాయులు విద్యార్థుల అభ్యసనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంఈఓ పి.బాల భాస్కరరావు అన్నారు. మండలంలోని సోంపురం,చిన గుడిపాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను, అలాగే వల్లంపూడి ఎంపీ.ఎంపీ పాఠశాలను శనివారం ఆయనతోపాటు పరిశీలించారు. ఈ సందర్భంగా సోంపురం క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు బి.పి.ఏ రాజు సోంపురం పాఠశాలను ప్రార్ధనా సమయానికి సందర్శించి పాటశాల పరిసరాలు తరగతి గదులు, పాఠశాల ప్రార్ధనా నిర్వహణ మొదలగునవి పరిశీలించి అంతరం విద్యార్థులతో తెలుగు, ఇంగ్లీష్, అభినయగేయాలు, వర్ణమాల,పదాలు అంకెలు, సంఖ్యలు ఒక వరుస కూడికలు, తీసివేతలు చేయించారు. వర్క్ బుక్స్, టీచర్ హ్యాండ్ బుక్స్, ఏం.డి.ఏం రిజిస్టర్స్,కిచెన్, గార్డెన్, విద్యార్థులకు అందిస్తున్న రాగి మాల్ట్ మొదలగునవి పరిశీలించి పలు సూచనలు సలహాలు అందించారు. అలాగే చిన గుడిపాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ బాల భాస్కరరావు సందర్శించి 1-5 తరగతుల విద్యార్థులకు చతుర్విధ ప్రక్రియలు చేయించారు. వేపాడ క్లస్టర్ ప్రధానోపాధ్యాయురాలు ఎస్ ఎస్ వల్లి,వల్లంపూడి ఎంపీ ఎంపీ పాఠశాలను సందర్శించి. పాటశాల పరిసరాలు, తరగతి గదులు, టాయిలెట్స్ మొదలగునవి పరిశీలించి, 2వ తరగతి విద్యార్థులతో తెలుగు పదాలు చదివించి, అంకెలు, సంఖ్యలు, కూడికలు, తీసివేతలు చేయించారు. అలాగే విద్యార్థుల హాజరు సకాలంలో వేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సిఆర్పి రాంప్రసాద్ పాల్గొన్నారు.

ఎరువులు అధిక రేట్లు అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలి



విశాలాంధ్ర-రాజాం : రాజాం పరిసర ప్రాంతాలలో ఎరువుల అమ్ముతున్న పలు దుకాణాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారు. గత కొన్ని రోజులుగా ఎరువులు దొరకక, ఇప్పుడు దొరుకుతున్నాయి అంటే అధిక రేట్లకు అమ్ముతున్నారు. సామన్య రైతులు ఎరువులు అధిక రేట్లకు కొని వ్యవసాయం చేయాలంటే రైతులం చాలా నష్టపోతామని పలువురు రైతులు ఆవేదన వ్యక్తపరిచారు. అధికారులు స్పందించి అధిక రేట్లకు అమ్ముతున్న దుకాణాలు పై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుచున్నారు.

ప్రజారోగ్య పరిరక్షణ సామాజిక బాధ్యత

నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ అప్పలరాజు

విశాలాంధ్ర-విజయనగరం: ప్రజారోగ్య పరిరక్షణ సామాజిక బాధ్యతని విజయనగరం నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ కిల్లానా అప్పలరాజు అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా వర్షాకాలంలో ఆరోగ్య పరిరక్షణ అనే అంశంపై వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక ఎస్బిఐ మెయిన్ బ్రాంచ్ వద్దనున్న గాంధీ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించారు. అనంతరం బాపూజీ విగ్రహం వద్ద స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞను చేశారు. ఆ తర్వాత కస్పా హై స్కూల్లో విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలు, చేతుల పరిశుభ్రత వంటి అంశాలపై వివరించారు. అలాగే కణపాక ప్రాంతంలో అంటురోగాల ప్రభలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు విస్తృత స్థాయిలో వివరించారు. ఈ సందర్భంగా సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు మాట్లాడు తూ రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. ప్రతినెల 3వ శని వారం ఇటువంటి కార్య క్రమాలను చేపడుతూ ప్రజలను ఆరోగ్యం పట్ల పరిశుభ్రత పట్ల విస్తృ తంగా అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పా రు. వర్షాకాలంలో ప్రజలు తీసుకోవలసిన జాగ్ర త్తలు గూర్చి అంటు రోగాలు ప్రబల కుండా ముందస్తు చర్యల గురించి వివరించడం జరుగుతుందన్నారు. వర్షపు నీటి వల్ల బురదమయంగాను పరిసరాలు అపరిశుభ్రంగాను ఉంటాయ న్నారు. ఎక్కడబడితే అక్కడ నీటి నిల్వలు ఉండడం వల్ల దోమలు వృద్ధి చెందుతాయని, తద్వారా అంటు రోగాలు ప్రబలే అవకాశం ఉందని అన్నారు. కావున వర్షాకాలంలో పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థులు తరచూ చేతులను కడుక్కోవాలని భోజనం చేసేటప్పుడు తప్పనిసరిగా చేతులను కడుక్కొని భుజించడం మంచిదని సూచించారు. ఈ కార్యక్ర మంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, టిపిఆర్ఓ సింహాచలం పాల్గొన్నారు.

మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాలవిద్యార్థులకు దుస్తులు పంపిణీ

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్: మహారాజ ప్రభుత్వ సంస్కృత కళాశాలలో శనివారం పి.డి.సి మొదటి సంవత్సరం చదువుతున్న 30 మంది విద్యార్థులకు 15,000 రూపాయల విలువ గల యూనిఫామ్ లు బాలాజీ వాటర్స్ క్లబ్ విజయనగరం వారు క్లబ్ అధ్యక్షులు నాగమణి చేతులమీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు.ఈసందర్భంగా కళాశాల ప్రాచార్యులు గంటా జనార్ధన నాయుడు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ క్లబ్ చేపట్టిన కార్యక్రమాలు విద్యార్థులకు సదవకాశం కాగలదని, క్లబ్ చేసిన సేవలను అభినందించారు. క్లబ్ అధ్యక్షులు నాగమణి మాట్లాడుతూ విద్యార్థులు దుస్తులు ధరించి వారి భవిష్యత్తు తీర్చిదిద్దుకుంటారని ఆశిస్తు న్నట్టు తెలిపారు. క్లబ్ సెక్రటరి కె. శ్రీదేవి మాట్లాడుతూ విద్యా ర్థులు ఉన్నత శిఖరాలను చేరాలని ఆకాంక్షిస్తున్నాను అన్నారు. క్లబ్ డిప్యూటీ గవర్నర్ సీతాలక్ష్మి, సత్యనారాయణ మూర్తి, సాయి సత్యప్రసాద్, ఝాన్సీ, లావణ్య లత పాల్గొని విద్యార్థులకు ఆశీస్సులు అందించారు. సమన్వయకర్తగా వ్యవహరించిన కళాశాల గ్రంథాలయాధికారి పి.గౌరీశ్వర రావు మాట్లాడుతూ విద్యార్థులకు అనేక సూచనలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు మరియు విద్యార్థులు హాజరయారు.

వికలాంగులపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు అన్యాయం

విశాలాంధ్ర-గరివిడి: వికలాంగులపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చేయడం అన్యాయమని గరివిడి వైసిపి మండల పార్టీ అధ్యక్షులు మీసాల విశ్వేశ్వరరావు అన్నారు. కదల్లేని నిశ్యయులు 20 ఏళ్లుగా పెన్షన్ పొందుతున్నారు.అలాంటి వారిపై రీ వెరిఫికేషన్ అనే పేరుతో వైద్యులపై ఒత్తిడి తెచ్చి పెన్షన్ సగం మంది తొలగించారు. వారిని చూస్తే తొలగిం చడానికి కూటం ప్రభుత్వానికి మనసు ఎలా వచ్చిందని ధ్వజమెత్తారు. మండలంలో 1498 పెన్షన్ ఉండగా అర్హులు 909 మంది, అన అర్హులు 327 మంది ఉండగా మిగతా 262 మంది పెన్షన్లు ఏమయ్యా అని అడిగారు. రాష్ట్రంలో అనహర్హత నోటీస్ అందుకున్న దివాంగులకు వచ్చే నెల నుంచి పెన్షన్లు ఇవ్వబోమని కూటమి ప్రభుత్వం తెలిపింది. ఎన్నికల సమయంలో సూపర్‌సిక్స్ తో పాటు వందల పథకాలు అందిస్తామని పలికిన కూటమి పార్టీలు అన్నింటిని ఎగ్గొట్టాయని వైయస్సార్ పోరాటం తర్వాత సూపర్ సిక్స్ లో కొన్నింటిని అమలు చేశారని తెలిపారు. ఎన్నికల్లో ప్రతి కుటుంబం వద్దకు వెళ్లి ప్రతి కుటుంబానికి సంవత్సరానికి 1లక్ష 4000 ఇస్తామని బాబు షూరిటీ భవిష్యత్ గ్యారంటీ అనే బాండ్ పేపరు ఇచ్చారు. ఓట్లు కోసం ప్రజలను లేనిపోని పథకాలు ఇస్తామని చెప్పి ప్రజలు మోసం చేసిన కూటమి కూటమి ప్రభుత్వంపై ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. 18 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళకు 1500 ప్రతినెల ఇస్తామని చెప్పిన ప్రభు త్వం ఇప్పటికి సంవత్స రం ఐదు నెలలు కావస్తున్న ఏ ఒక్కరికి ఒక్క రూపాయి కూడా ఇవ్వడం లేదు. రైతులకు అన్నదాత సుఖీభవాని సంవత్సరానికి 20000 ఇస్తానని ప్రభుత్వం రెండు సంవత్సరాలలో అవుతున్న ఇప్ప టికీ ఎటువంటి రైతుకు ఒక్క రూపాయి ఇవ్వడం జరగలేదు. రాష్ట్రంలో ఎప్పుడూ లేనంతగా యూరియా కొరత ఈ సంవత్సరం గవర్నమెంట్ పరిస్థితిలో నెలకొంది. ఈ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ,గానీ గ్రామపంచాయతీ నిధులు ,కానీ కొత్త పెన్షన్లు ఇవ్వడం లేదు. ఉన్న పెన్షన్లు తీసేయడంలో ముందడుగు వేస్తుంది. ఇప్పటికైనా ప్రభుత్వం పునరా ఆలోచన చేసి లబ్ధిదారులందరకు ఇవ్వవలసిన పథకాలు అన్ని ఇవ్వాలని కోరుకుంటున్నాము. లేనియెడల ప్రజల కోసం మేము పోరాడతాము అని తెలిపారు. కార్యక్రమంలో ఎడ్ల అప్పారావు, శ్రీరాములు మాస్టర్, బమ్మిడి కార్తీక్, గుడివాడ తమ్మి నాయుడు, ఎలుకలు అప్పలనాయుడు, జి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పనిచేసే ప్రదేశాల్లో లింగ వివక్షత తగదు

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.భవిత



విశాలాంధ్ర-విజయనగరం: కంటోన్మెంట్ :నేడు జిల్లా కోర్టు కాన్ఫరెన్స్ హాల్లో న్యాయశాఖ సిబ్బందికి లింగ వివక్షత మరియు పోష్‌యాక్ట్ పై న్యాయ అవగాహన సదస్సును ఏర్పాటు చేసినారు. ఈ అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.భవిత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పని ప్రదేశంలో లైంగిక వేధింపుల నివారణ నిషేధం నిరోధక చట్టం, పోష్ యాక్ట్ 2013 నుంచి అమల్లోకి వచ్చింది.ఈ చట్ట ప్రకారం ఎవరైనా పని ప్రదేశంలో మహిళలపై లైంగిక పరమైన వేధింపులకు గురి చేసిన యెడల వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోబడతాయి. ఈ చట్ట ప్రకారం పని చేసే ప్రదేశాలు అనగా ప్రైవేట్ రంగం ప్రభుత్వ రంగం ప్రభుత్వ సంస్థలలో సహా అన్ని పని ప్రదేశాలకు ఇది వర్తిస్తుంది. ఇంటిలో పని చేసే మహిళలకు కూడా ఇది వర్తిస్తుంది అని తెలియజేశారు. పనిచేసే ప్రదేశాలలో అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేయడం, ఫిర్యాదులు దాఖలు చేయడానికి విధివిధానాలు పాటించటం, విధి విధానాలు పాటించిన వారికి జరిమానాలు విధించడం ఈ చట్టం నిర్దేశిస్తుంది .ముఖ్యంగా న్యాయశాఖ సిబ్బందికి ఈ పొష్ యాక్ట్ పై అవగాహన కల్పించారు. పనిచేసే ప్రదేశాల్లో సోదర భావం కలిగి ఉండాలని హితవు పలికారు.ఈ కార్యక్రమంలో కె.విజయ కళ్యాణి ఫ్యామిలీ కోర్ట్ జడ్జ్, బి. అప్పలస్వామి ఎస్సీ ఎస్టీ కోర్టు జడ్జ్, ఎం.పద్మావతి మహిళా కోర్ట్ జడ్జ్, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఏ.కృష్ణ ప్రసాద్, న్యాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

షెడ్యూల్ యాక్ట్ పై అవగాహన





విశాలాంధ్ర-విజయనగరం కంటోన్మెంట్ : జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ ఉత్తర్వులు మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, విజయనగరం రెవిన్యూ శాఖ ఆధ్వర్యంలో శనివారం ధర్మపురి గ్రామంలో ఎస్సి, ఎస్టీ యాక్ట్ పై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎమ్ భవిత మాట్లాడుతూ పౌర హక్కుల రక్షణ చట్టం 1955, షెడ్యూల్ కులాలు, షెడ్యూలు తెగల అత్యాచారాల నివారణ చట్టం 1989 ఈ రెండు చట్టాలు షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల హక్కులను రక్షించడం, వారిపై దురాగతాలను నిరోధించడం కోసం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. షెడ్యూల్ కులాలు, తెగల అత్యాచారాల నివారణ చట్టం ప్రత్యేకంగా వారిపై జరిగే నేరాలను దౌర్జన్యాలను అరికడుతుంది అన్నారు. ఈ నేరాల విచారణ కోసం ప్రత్యేక కోర్టులు ఏర్పాటు, బాధితులకు ఉపశమనము, పునరావాస కల్పించడం ఈ చట్టం యొక్క ముఖ్య ఉద్దేశం అని తెలియజేశారు .ఈ చట్టం భౌతిక హింస, సామాజిక బహిష్కరణలు, ఆర్థిక దోపిడీతో సహా అనేక రకాల నేరాలను కవర్ చేస్తుందన్నారు. పిసిఆర్ చట్టం అంటరాని తనం, సంబంధిత వైకల్యాలను నిర్మూలించడంపై దృష్టి పెడుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఏ. కృష్ణప్రసాద్, డిప్యూటీ తాసిల్దార్ స్వర్ణ కుమార్, రెవెన్యూ సిబ్బంది, పెద్దఎత్తున గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, ప్రజలకు సేవలందించాలి

అర్ధ సంవత్సర నేర సమీక్షా సమావేశంలో విశాఖ రేంజ్ డిఐజి గోపినాథ్ జట్టి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జిల్లాలో వివిధ పోలీసు స్టేషనుల్లో పని చేస్తున్న పోలీసు అధికారులు, ఇతర శాఖల అధికారులతో అర్ధసంవత్సర నేర సమీక్షా సమావేశాన్ని జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయంలో ఆగస్టు 23న నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశానికి విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి, ఐపిఎస్ ముఖ్య అతిథిగాను, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి ఎం.బబిత, జిల్లా కలెక్టరు డా.బి.ఆర్. అంబేద్కర్ అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి, ఐపిఎస్ మాట్లాడుతూ - ఇటీవల నమోదవుతున్నఎన్.డి.పి.ఎస్. కేసుల్లో పలువురు విద్యార్థులు నిందితులుగా అరెస్టు అవుతున్నారన్నారు. ఎక్కువ కేసుల్లో విద్యార్థులే గంజాయి వినియోగదారులుగా, సరఫరా చేసే వ్యక్తులుగా మారుతు న్నారన్నారు. గంజాయికి అలవాటు పడిన వ్యక్తులనుప్రాథమిక స్థాయిలోనే గుర్తించి, డీ-అడిక్షన్ సెంటర్స్కు పంపి, అవసరమైన వైద్యంను అందించాలన్నారు. మహిళలు బస చేసే ప్రైవేటు, ప్రభుత్వ హాస్టల్స్ లోను భద్రత ఏర్పాట్లును అధికారులు సమన్వయంతో పర్యవేక్షించాలని, మహిళల భద్రతకు హాస్టల్స్లో సెక్యూరిటీ గార్డు, కాంపౌండ్ వాల్, సిసి కెమెరాలు ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. వివిధ కేసుల్లో మహిళలకు, బాధితులకు పరిహారం సకాలంలో అందే విధంగా చూడాలన్నారు. ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి ఎం.బబిత మాట్లాడుతూ - మహిళలు బసచేసే హాస్టల్స్, హెరీంలలో భద్రత ఏర్పాట్లును పర్యవేక్షిం చాలని అధికారులను ఆదేశించారు. న్యాయ స్థానాల్లో ప్రాసిక్యూషను వేగవంతంగా పూర్తయ్యే విధంగా చూసేందుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు నియమించాలని జిల్లా కలెక్టరును కోరారు. లోక్ అదాలత్లో ఎక్కువ కేసులు రాజీ అయ్యే విధంగా పోలీసు అధికారులు చర్యలు చేపట్టాలని, సెప్టెంబరు 13న నిర్వహించే లోక్ అదాలత్ విజయవంతం అయ్యే విధంగా చూడాలని పోలీసు అధికారులను కోరారు. కలెక్టరు అండ్ మెజిస్ట్రేట్ డా.బి.ఆర్.అంబేద్కర్, ఐఎఎస్ మాట్లాడుతూ - జిల్లాలో పోలీసుశాఖ చక్కగా పని చేస్తుందని, గత ఏడాది శ్రీ పైడితల్లమ్మ ఉత్సవంలో ఎటువంటి అవాంతరాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమన్వయంతో పనిచేసామన్నారు. ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ - అర్ధ సంవత్సరంలో నేరాల నమోదు తీరును, నేరాల నియంత్రణకు జిల్లా పోలీసుశాఖ చేపట్టిన చర్యలను జిల్లా ఎస్పీ వివరించారు. శక్తి యాప్ పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా రూపొందించిన షార్టు ఫిల్మ్ను విశాఖ రేంజ్డిఐజి గోపీనాథ్ జట్టి, ఐపిఎస్ ఆవిష్కరించారు. ఈ షార్టు ఫిల్మ్ ను రూపొందించుటకు కృషి చేసిన అగ్గిరాజు, రాజావశేఖరలను అధికారులు ప్రత్యేకంగా అభినందించి, సాలువతో ఘనంగా సత్కరించారు. అదే విధంగా గంజాయి కేసుల్లో ఫైనాన్సియల్ ఇన్వెస్టిగేషను సమర్ధవంతంగా పూర్తి చేసిన ఎస్.కోట సిఐ వి.నారాయణమూర్తి, బొబ్బిలి రూరల్ సిఐ కే.నారాయణరావు లకు రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి ప్రశంసా పత్రాలను ప్రదానం చేసారు. ఈ నేర సమీక్షా సమావేశంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, డిస్ట్రిక్ట్ ట్రాన్స్పోర్టు కమీషనరు డి.మణి కుమార్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.శ్రీనాధుడు, డి.ఎఫ్.ఓ. ఆర్. కొండలరావు, డి.ఎం. అండ్ హెచ్.ఓ. డా. జీవన్ రాణి, డి.ఈ.ఓ. కే.వి.రమణ, మున్సిపల్ అసిస్టెంట్ కమీషనరు కే.అప్పలరాజు, విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీని వాసరావు, బొబ్బిలిజి. భవ్యా రెడ్డి, చీపురుపల్లి డిఎస్పీ ఎస్.రాఘవులు, మహిళా పిఎస్ డిఎస్పీ ఆర్.గోవిందరావు, డిటిసి డిఎస్పీ ఎం.వీరకుమార్, న్యాయ సలహాదారులు వై.పరశురాం, జైలుశాఖ, వుమన్ అండ్ చైల్డ్ వెల్ఫేరు, ఆర్ అండ్ బి, మెరైన్, డ్రగ్స్ కంట్రోల్ మరియు ఇతర శాఖలకు చెందిన అధికారులు, పలువురు సిఐలు, వివిధ పోలీసు స్టేషనుల్లో ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



బ్రహ్మకుమారిస్ సంస్థ దేశవ్యాప్తంగా మెగా రక్తదాన శిబిరం

=విశాలాంధ్ర-గరివిడి: మానవత్వమే మతమని భావిస్తూ సేవా నిజమైన సాధనమైన నమ్ముతూ బ్రహ్మకుమారిస్ సంస్థ దేశవ్యాప్తంగా మెగా రక్తదాన కార్యక్రమం నిర్వహించింది. రక్తదానం ద్వారా ప్రాణ రక్షణ అని దేశవ్యాప్తంగా వేలాదిమంది యువతీ యువకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇది కేవలం రక్త సేకరణ కాదు రక్తదానంపై ప్రజల్లో అవగాహన పెంచే ఆధ్యాత్మిక ఉద్యమంగా మారింది. గరివిడిలో ఓం శాంతి భవనంలో లతక్క ఆధ్వర్యంలో జరిగే శిబిరంలో రాజకీయ నాయకులు యువతీ యువకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. లతక్క మాట్లాడుతూ రక్తదానం చిన్న సహాయం కాదు అది ఒక ప్రాణానికి జీవనోదానం అని తెలిపారు. రక్తదాన కార్యక్రమంలో 80 మంది హాజరవుగా 60 మంది వరకు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో భోగావరపు శ్రీదేవి, జడ్పిటిసి వాకాడ శ్రీనివాసరావు, ఎంపీపీ మీసాలు విశ్వేశ్వరరావు, బమ్మిడి కార్తీక్, బ్రహ్మకుమారీస్ ఇంచార్జ్ అన్నపూర్ణ, హేమలత, రెడ్ క్రాస్ వైదు సిబ్బంది,రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు. ..

బ్రహ్మకుమారిస్ లో రక్తదాన శిబిరానికి అద్భుత స్పందన

విశాలాంధ్ర-చీపురుపల్లి : విశ్వ బంధుత్వ దినోత్సవం సందర్భంగా చీపురుపల్లిలోని బ్రహ్మకుమారిస్ సేవా కేంద్రంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి అద్భుత స్పందన లభించింది. శిబిరాన్ని చీపురుపల్లి డి.ఎస్.పిఎస్. రాఘవులు, బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రాల జిల్లా ఇంచార్జ్ రాజయోగిని బికే అన్నపూర్ణ దీదీజి ప్రారంభించారు. చీపురుపల్లి పరిసర గ్రామాల్లో ఉన్న బ్రహ్మకుమారీలు, యువత ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. మొత్తం 113 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా రాజీయోగిని అన్నపూర్ణ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో గిన్నిస్ బుక్ లో నమోదుకు లక్ష యూనిట్ల రక్తం సేకరణ లక్ష్యంగా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాలు బ్రహ్మకుమారీస్ చీపురుపల్లి కేంద్రం ఇన్చార్జి బికే శాంతి, బ్రహ్మకుమారీలు యువత పాల్గొన్నారు.

అమావాస్య రోజున పేదలకు అన్నదానం

విశాలాంధ్ర-రాజాం : రాజాం పట్టణంలో తెలగా వీధికి చెందిన పోలిశెట్టి శ్రీనివాసరావు పాత బస్టాండ్ ఆవరణలో నవదుర్గ అమ్మవారి పూజా సామాగ్రి అమ్ముకుంటూ, ఒక చిన్నపాటి దుకాణం నడుపుకుంటున్నటువంటి ఇతను ప్రతి అమావాస్య రోజున పేదలకు అన్నదానం చేస్తారు. ఆయన చేస్తున్నటువంటి ఈ అన్నదానానికి రాజాం ప్రాంతంలో బిక్షాటన చేస్తున్న వారందరూ, నిరుపేదలు ప్రతి అమావాస్య రోజున అతని దుకాణం వద్దకు చేరి అతను అందిస్తున్నటువంటి అన్న ప్రసాదాన్ని స్వీకరిస్తారు. ఆయన మాట్లాడుతూ నాకు అవకాశం ఉన్నదాంట్లో ప్రతి అమావాస్య రోజు సుమారు వందమందికి నేను ఈ అన్నప్రసాదాన్ని పంచి పెడుతున్నానని, భగవంతుడు నాకు ఇంకా అవకాశం, శక్తి కలిగించినట్లయితే ప్రతిరోజు కూడా నేను ఇలా అన్నదానం చేయడానికి ముందుకు వస్తానని ఆయన అన్నారు. ఆయన చేస్తున్నటువంటి ఈ కార్యక్రమానికి పలువురు శ్రీనివాసరావును అభినందిస్తున్నారు. ఈయన చేస్తున్నటువంటి ఈ సేవా కార్యక్రమాన్ని పలువురు ఆదర్శంగా తీసుకోవాలి.

సీతంలో నైపుణ్యాభివృద్ధి, వృత్తి మార్గదర్శకత్వంపై ప్రేరణా కార్యక్రమం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : స్థానిక గాజులరేగ పరిధిలో గల సీతం కళాశాలలో ప్రథమ సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థులకు రెండవ రోజు ఇండక్షన్ ప్రోగ్రాం లో భాగంగా "స్కిల్ డెవలప్మెంట్, కెరీర్ గైడెన్స్ అనే అంశంపై అవగాహన కల్పించడానికి ముఖ్యఅతిథిగా మహారాజా ఫార్మసీ కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్, అసోసియేట్ ప్రొఫెసర్ కె. సీతాకుమారి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో విద్యార్థులకు విద్యతో పాటు సాఫ్ట్ స్కిల్స్, ఈ- కామర్స్, సమస్యలను పరిష్కరించుకునే నైపుణ్యాలు, వ్యవస్థాపకత, సృజనాత్మకత, స్టార్టప్స్ వంటి అనేక అంశాలపై అవగాహన ఉండాలని ఉదాహరణలతో వివరించారు. ప్రస్తుతం ఉన్న టెక్నాలజీ గురించి, ఆ టెక్నాలజీని ఉపయోగించి విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించుకునే మార్గాల గురించి ఆమె విస్తృతంగా వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి వి రామమూర్తి, మొదటి సంవత్సరం విభాగాధిపతి డాక్టర్ కె శ్రీలత, ఇతర అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

గర్భాం మెయిన్ రోడ్ లో అక్రమ నిర్మాణాల తొలగింపు

విశాలాంధ్ర-మెరకముడిదాం : మండలంలో గర్భాం మెయిన్ రోడ్ లో గత కొన్నేళ్లుగా అక్రమ నిర్మాణాలు చేపట్టి దుకాణాలు నిర్వహిస్తున్నారు. దీంతో ఇటీవల కురిసిన వర్షాలకు నీరు మెయిన్ రోడ్డు పై అక్రమ కట్టడాల పుణ్యమా అని చెరువును తలపించింది. దీంతో నివాసముంటున్నటువంటి రెల్లి కులస్తులు పంచాయతీ వారికి ఫిర్యాదు చేయడం జరిగింది. దీనికి స్పందించిన పంచాయితీ అధికారులు శనివారం యుద్ధ ప్రాతిపదికన అక్రమ నిర్మాణాలను తొలగించారు. కొంతమంది స్వచ్ఛందంగా అక్రమ నిర్మాణాలు తొలగించినప్పటికీ, మరి కొంతమంది చివరి క్షణాల వరకు భీష్మించుకుని కూర్చున్నారు. నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతో పంచాయతీ సిబ్బంది తొలగింపుకు పూనుకున్నారు. దీంతో తొలగింపు చేయని ఆ క్రమ దారులు ఏమి పాలు పోనీ పరిస్థితిలో మిన్నకుండిపోయారు. ఏది ఏమైనప్పటికీ ఆక్రమనల తొలగింపు పై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇన్నాళ్లకు ట్రాఫిక్ జామ్ నుండి ఉపశమన కలగడం పట్ల పరిసర గ్రామాల ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగస్తులు పంచాయతీ సిబ్బందికి అభినందనలు తెలిపారు.

జిల్లా యువకుడికి జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్:

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్: ఝార్ఖడ్ రాష్ట్రంలో జరిగిన జంషెడ్ పూర్ స్టేట్ నేషనల్ సీనియర్స్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ - 2025 పోటీలలో విజయనగరానికి చెందిన శీల రామకృష్ణ అనే యువకుడు పాల్గొని జిల్లా గర్వించే విధంగా సంచలన ప్రదర్శన చేసాడు. విజయనగరం జిల్లా పరిషత్ లో కంప్యూటర్ ఆపరేటర్ గా పని చేస్తున్న రామకృష్ణ ఈ నెల 18 నుంచి 21 వరకు ఝూర?ండ్ లో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీలలో పాల్గొని 550 కేజీలు బరువు ఎత్తి గోల్డ్ మెడల్ సాధించాడు. విజయనగరానికి చెందిన వ్యక్తి జాతీయ స్థాయి పోటీలలో గోల్డ్ మెడల్ సాధించడంపై జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించడానికి ప్రభుత్వం సహాయం చేయాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా శనివారం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు (చిన్న శ్రీను), జడ్పీ సీఈవో బీవీ సత్యనారాయణ లు రామకృష్ణను అభినందించారు.

స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర పై అవగాహన

గ్రామ పురవీధుల్లో విద్యార్థులతో ర్యాలీ



విశాలాంధ్ర-మెరకముడిదాం: మండలంలో చినబంటు పల్లిలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల అభివృద్ధి అధికారి జి భాస్కర రావు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మండల అభివృద్ధి అధికారి మాట్లాడుతూ గ్రామంలో కాలువల శుభ్రత, తడి చెత్త పొడి చెత్త సేకరణ, నీటి నిల్వల నివారణ, వెక్టార్ నియంత్రణ చర్యలు వంటి వాటిపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం గ్రామ పురవీధుల్లో విద్యార్థులు మరియు గ్రామస్తులు చే ర్యాలీ నిర్వహిస్తూ నినాదాలు చేశారు. అనంతరం గ్రామంలో గ్రామ సభ ఏర్పాటు చేసి వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. అదేవిధంగా గ్రామంలో చెత్తాచెదారం పేరుకు పోకుండా, నీటి నిల్వల్లో దోమలు చేరకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రతినిధి కోట్ల విశ్వేశ్వరరావు, మండల గ్రామస్థాయి అధికారులు, గ్రామ ప్రజలు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

డీఎస్సీ ఫలితాల్లో సత్తా చాటిన శేషపుపేట యువత

ఒకే గ్రామంలో నలుగురుకి ఉద్యోగాల పంట

విశాలాంధ్ర-గుర్ల : మండలంలో ఉపాధ్యాయ నియమక ఫలితాల్లో శేషపుపేట విద్యార్థులు తమ సత్తా చాటారు. మండలంలో అతి చిన్న గ్రామమైన ఆ గ్రామంలో ఈమధ్య జరిగిన డీఎస్సీ ఫలితాల్లో నలుగురికి ఒకే సారీ ఉద్యోగాలు సాధించారు అదే విధంగా పోలీసు ఉద్యోగ ఫలితాల్లో ఇద్దరు సాధించారు. దీంతో గ్రామములో ఎంతో ఆనంద వ్యక్తం చేస్తున్నారు చిన్న గ్రామమైన ఉద్యోగాలు సాధించడంలో పట్టుదల శ్రమ యువత కనబరిచారు. అందులో చందక సరస్వతి,ఎస్జిటి కంది సత్యనారాయణ,ఎస్జిటి సంగారెడ్డి సత్యం, ఎస్ఏ చందక లక్ష్మణ పి ఈ టి లో సత్తా చాటారు ఉద్యోగుల పంట పండడంతో గ్రామములో వారి తల్లిదండ్రులు ఆనంద వ్యక్తం చేస్తున్నారు వీరంతా వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు దీంతో గ్రామములో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కోండ్రు

భారీ ర్యాలీ అనంతరం శ్రమదానం

విశాలాంధ్ర-రాజాం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తరువాత "స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమం జోరుగా కొనసాగుతోందని మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ రాజాం నియోజకవర్గం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు.ప్రతి నెల 3వ శనివారం రాష్ట్రవ్యాప్తంగా ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛంద సేవాకార్యక్రమాలు జరుగుతున్నా యన్నారు. స్వర్ణాంధ్ర 2047 సంకల్పంలో భాగంగా రాజాం మండలం పొగిరి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.జిల్లా పరిషత్ పాఠశాల వద్ద టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పాఠశాల నుంచి పొగిరి అంబేద్కర్ విగ్రహం వరకు విద్యార్థులు,ఉపాధ్యాయులు,స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ప్రజాప్రతినిధులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం రోడ్డుపై ఉన్న చెత్తా చెదారాన్ని ఊడ్చి,కాలువలో మందును చల్లారు. అనంతరం మాట్లాడుతూ ప్రతీ మూడో శనివారం రాష్ట్ర వ్యాప్తంగా పరిశుభ్రతకు మారుపేరుగా ఉంచేందుకు విజనరీ నేత చంద్రబాబు కృషిచేస్తున్నారన్నారు.వర్షాకాలంలో పలు స్వచ్ఛంద సంస్థలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నాయన్నారు. ప్రజలు పరిశుభ్రతలో భాగస్వామ్యం కావాలన్నారు.రానున్న రోజుల్లో స్వచ్ఛ ఆంధ్రగా తయారవుతాదన్నారు. రాష్ట్రంలో పెన్షన్లు తొలగించామని వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారాలు మానుకోవాలన్నారు.చనిపోయినవారి పెన్షన్లు మాత్రమే తొలగించా మన్నారు. భర్త చనిపోతే భార్యలకు పెన్షన్ అందజేస్తున్నామన్నారు.కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్లను పంపిణీ చేస్తున్నామన్నారు. దివ్యాంగుల పెన్షన్లపై వైసీపీ విష ప్రచారం మానుకోవాలని హితవుపలికారు. అనంతరం రాజాం డోలపేటలో పునః ప్రతిష్ఠ అయిన శ్రీ అభయాంజనేయ స్వామి వారి దేవాలయంకు వెళ్ళి ప్రత్యేక పూజలు చేసి ఆలయ నిర్మాణ దాత పొట్నూరు లక్ష్మణ ను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సుమల వెంకట మన్మధరావు, గురవాణ నారాయణ రావు,వంగా వెంకటరావు, దుప్పల పూడి శ్రీను, లచ్చుభుక్త కృష్ణమూర్తి, సుమల జగన్ మోహన్,దాసరి మురళీ, కెల్ల వెంకట రమణ, జెవి రమణ, చిట్టి, మరిపి జగన్మోహన్,ముగడ శ్రీను,జనసేన నేత ఊర్లాపు పోలిరాజు తదితర కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

విశాలాంధ్ర-భోగాపురం: మండలంలో క్యూఆర్ కోడ్తో కూడిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ఈనెల 25 నుంచి 30 వరకు జరగనుందని తాసిల్దార్ రమణమ్మ తెలిపారు. మండలంలో 18337 రేషన్ లబ్ధిదారులుకు స్మార్ట్ రేషన్ కార్డులు గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు అందజేయనున్నారని ఆమె తెలిపారు. సచివాలయ ఉద్యోగులు ఇంటి వద్ద కార్డు అందించడానికి వచ్చినప్పుడు సంబంధిత లబ్ధిదారులు ఇంట్లో లేకపోతే, ఆ కార్డులను వారికి సంబంధించిన రేషన్ దుకాణాల్లో పొందవచ్చని తాసిల్దార్ తెలిపారు.సెప్టెంబర్ 1వ తేదీ నుంచి రేషన్ సరుకుల పంపిణీ కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారానే జరుగుతుందని పేర్కొన్నారు. ఈ స్మార్ట్ కార్డులో ప్రభుత్వ రాజముద్రలతో పాటు కుటుంబ సభ్యుల వివరాలు, ప్రత్యేక క్యూఆర్ కోడ్ కూడా ఉంటుందని ఆమె వివరించారు. ఏదైనా సాంకేతిక సమస్యలు లేదా ఇబ్బందులు తలెత్తినపుడు లబ్ధిదారులు టోల్ ఫ్రీ నెంబర్ 1967ను సంప్రదించాలని తాసిల్దార్ సూచించారు. స్మార్ట్ రేషన్ కార్డుల అమలుతో పారదర్శకత పెరగడంతో పాటు, లబ్ధిదారులకు సులభతర సేవలు అందుతాయని ఆమె పేర్కొన్నారు.

నేరాల నియంత్రణలో సాంకేతికతను విరివిగా వినియోగించుకోవాలి

విశాఖపట్నం రేంజ్ డిఐజీ గోపినాథ్ జట్టి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : వార్షిక తనిఖీల్లో భాగంగా విశాఖపట్నం రేంజ్ డీఐజీ శ్రీ గోపీనాథ్ జట్టి, ఐపిఎస్ శనివారం 2వ పట్టణ పోలీసు స్టేషను సందర్శించారు. అనంతరం, స్టేషను ప్రాంగణంను పరిశీలించి, పోలీసు స్టేషన్ లోని సి.సి.టి.వి. కమాండ్ కంట్రోల్ రూమును సందర్శించి సి.సి.టి.విల పనితీరును పరిశీలించి 2వ పట్టణ పోలీసు స్టేషను సిఐకి సూచనలు చేసారు. పోలీసు స్టేషన్లో పనిచేస్తున్న కోర్ట్ కానిస్టేబుల్స్తో మాట్లాడి కోర్టులో శిక్షలు పడటానికి అనుసరించాల్సిన పద్ధతుల గురించి వివరించారు. సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపర్చాలని, సమన్లు సకాలంలో సర్వ్ చేయాలని, సాక్షులు వారి సాక్ష్యంను కోర్టులో చెప్పే విధంగా బ్రీఫింగ్ చెయ్యాలన్నారు. అనంతరం, పోలీసు స్టేషన్ లోని రిసెప్షన్, గదులను పరిశీలించి, రికార్డులు, సీడీ ఫైల్స్ తనిఖీ చేసి, పోలీసు స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలపై సమీక్షించారు. నేరాలు నియంత్రనలో సాంకేతికతను విస్తృతంగా వినియోగించి నేరాలను అదుపు చేయాలన్నారు. సైబర్ నేరాలను నియంత్రించుటకు అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని, సైబర్ నేరాలు దర్యాప్తులో సాంకేతికతను వినియోగించుకోవాలని, బాధితులకు న్యాయం చెయ్యాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో త్వరలో అన్ని పోలీసు స్టేషన్లకు డ్రోన్స్లు సరఫరా చేస్తామన్నారు. అనంతరం మహిళా సంరక్షణ పోలీసులతో డిఐజి మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మహిళా సంరక్షణ పోలీసుల పాత్ర సమాజంలో చాలా కీలకం అని, వారు శక్తి యాప్ గురించి క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలని, ఆపద సమయాల్లో శక్తి యాప్ ఉపయోగించి, పోలీసుల సహాయం ఏవిధంగా రక్షణ పొందాలో ప్రజలకు ముఖ్యంగా మహిళలు, విద్యార్థినులకు వివరించాలన్నారు. మహిళలు, విద్యార్థినుల రక్షణను దృష్టిలో పెట్టుకొని వారికి రక్షణగా నిలిచే చట్టాల పట్ల అవగాహన కల్పించాలని, అదేవిధంగా అసాంఘిక కార్యక్రమాలు మరియు గంజాయి గురించి సమాచారంను సేకరించి సంబంధిత అధికారులకు చేరవేయాలని ఎం.ఎస్.పి.లను డిఐజి ఆదేశించారు. మహిళలు, చిన్నారులపై ఎటువంటి అఘాయిత్యాలు జరగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను డిఐజి గోపీనాథ్ జట్టి ఆదేశించారు.

క్షేత్ర స్థాయిలో శాంతిభద్రతల సమస్యలు వచ్చే అంశాలను ప్రాథమిక స్థాయిలో గుర్తించి, వాటి నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. మసీదులు, చర్చిలు, దేవాలయాలు, దేవతా మూర్తులు, ప్రముఖుల విగ్రహాల భద్రతకు చర్యలు చేపట్టాలని, నిఘా పెట్టాలని, మరిన్ని సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, వాటి పరిరక్షణకు స్థానికులతో రక్షణ కమిటీ లను ఏర్పాటు చేయాలని అధికారులను డీఐజీ ఆదేశించారు. పోలీసు స్టేషన్ సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలు గురించి, వారు చేసే పనులను, ఎప్పటి నుండి పనిచేస్తున్నది గోపీనాథ్ జట్టి, ఐపిఎస్ గారు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విశాఖపట్నం రేంజ్ డిఐజీ గోపినాథ్ జట్టి మరియు జిల్లా ఎస్పి వకుల్ జిందల్ పోలీసు స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ వార్షిక తనిఖీల్లో విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి, ఐపిఎస్ వెంట జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు, ఎస్బి సిఐ ఎ.వి.లీలారావు, 2వ పట్టణ సిఐ టి. శ్రీనివాసరావు మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డీఈవో చేతుల మీదుగా కళా ఉత్సవ్ పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర విజయనగరం టౌన్ : కళా ఉత్సవ్ పోస్టర్ ను జిల్లా విద్యాశాఖాధికారి యు మాణిక్యం నాయుడు తన కార్యాలయం లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి విజయనగరం జిల్లా లోని ప్రభుత్వ గుర్తింపు ఉన్న విద్యా సంస్థల్లో చదువుతున్న 9 నుంచి 12 తరగతుల విద్యార్థులకు సంస్కృతి, వారసత్వకళల పై కళా ఉత్సవ్ బి 2025 పోటీలు ప్రభుత్వ డైట్ కళాశాలలో సెప్టెంబర్ 11 & 12 తేదీలలో నిర్వహిస్తున్నామన్నారు. పాల్గొనేవారు సంబంధిత వివరాలను గూగుల్ ఫార్మ్ నింపి రిజిస్టర్ చేసుకోవాలన్నారు.

కళారూపాల వివరాలు : గాత్ర సంగీతం - వ్యక్తిగత - శాస్త్రీయ సంగీతం, గాత్ర సంగీతం-బృందం-జానపద/భక్తి/దేశభక్తి సంగీతం, వాద్య సంగీతం- వ్యక్తిగత- శాస్త్రీయ రాగయుక్త సంగీతం, వాద్య సంగీతం- వ్యక్తిగత-శాస్త్రీయ తాళం, వాద్య సంగీతం - బృందం - ఆర్కెస్ట్రా (జానపద/శాస్త్రీయ), నృత్యం-వ్యక్తిగత- శాస్త్రీయ నృత్యం, నృత్యం-బృందం-ప్రాంతీయ జానపద/గిరిజన నృత్యం, నాటకం-బృందం-లఘు నాటకం/పాత్రాభినయం/మూకాభినయం), దృశ్య కళలు-ద్విమితీయ- (డ్రాయింగ్/పెయింటింగ్, దృశ్య కళలు-త్రిమితీయ-శిల్పకళ, దృశ్య కళలు-ద్విమితీయ, త్రిమితీయ-స్వదేశీ బొమ్మలు మరియు ఆటలు), నృత్యం, నాటకం, సంగీతం సమ్మిళితంగా సాంప్రదాయ కథ చెప్పడం.పై కళా పోటీల యందు ప్రథమ స్థానం పొందిన (విజేతలైన) విద్యార్థులకు అక్టోబర్ 23 & 24 తేదీలలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించు కళా ఉత్సవ్ 2025 పోటీలలో పాల్గొనే అవకాశం లభిస్తుందన్నారు మరిన్ని వివరాలకు డాక్టర్ కె రామకృష్ణారావు , ప్రిన్సిపాల్, గవర్నమెంట్ డైట్ కళాశాల,కళా ఉత్సవ్ నోడల్ అధికారి వాక చిన్నం నాయుడు లెక్చరర్ 9440912863 ని సంప్రదించాలన్నారు.

అంగన్వాడీ కేంద్రాలలో ప్రీస్కూల్ విద్యను బలోపేతం చేయాలి

సీడీపీఓ ఉమా భారతి

విశాలాంధ్ర-గంట్యాడ: ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న బుడతనాపల్లి సెక్టార్ పెనసాం అంగన్వాడి కేంద్రాలలో ఏ సి సి ఎ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగినది అంగన్వాడీ పరిధిలో ఉన్న ఏ స్కూల్ పిల్లల యొక్క తల్లిదండ్రులను సమావేశపరిచి ప్రీ స్కూల్ మెటీరియల్ డిస్ప్లే చేసి అంగన్వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న ప్రిస్కూల్ విద్య గురించి అవగాహన కల్పించడం జరిగినది. సిడిపిఓ భారతి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో ఆటపాటల ద్వారా కథలు కబుర్లు ద్వారా విద్యను నేర్పించడం జరుగుతుందని అదేవిధంగా పిల్లలకు మంచి అలవాట్లు, నేర్పించడం వేడివేడి భోజనం పెట్టడం జరుగుతుంది. కావున ఆరోగ్యము ఆహారము మంచి అలవాట్లు తో పాటు విద్య నైపుణ్యత తెలివితేటలు పిల్లల్లో వస్తాయి కావున ప్రీస్కూల్ కి పంపించాలని మూడు నుంచి ఐదు సంవత్సరాల వరకు ప్రీ స్కూల్ విద్య ను అభ్యసించాలని తల్లులకు తెలియజేయడమైనది . అదేవిధంగా పీపీ1, పీపీ2 ఇంటింటివిద్య ప్రి స్కూల్ కార్యక్రమాలను నిర్వహిస్తూ అంగన్వాడీ కేంద్రంలో ప్రీస్కూల్ పిల్లల నమోదును హాజరును పెంచవలనని కార్యకర్తలను కోరారు మరియు ఈరోజు కార్యక్రమం స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించి గ్రామస్తులకు పారిశుధ్యం మరియు వంటి వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి అని కేంద్రాన్ని నీటిగా ఉంచుకోవాలని అంటూ వ్యాధుల బారిన బాధపడకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ అనురాధ, అంగన్వాడి కార్యకర్తలు పైడ్రాజు, చిన్ని మరియు తల్లులు హాజరయ్యారు.

శుభ్రత పరిశుభ్రత పై ప్రత్యేక శ్రద్ధ వహిస్తే గ్రామం ఆరోగ్యంగా ఉంటుంది

తహసిల్దార్ అరుణ కుమారి

విశాలాంధ్ర-మెంటాడ: గ్రామాలు పరిశుభ్రంగా ఉండటం ద్వారా వ్యాధులు దరి చేరవని ప్రతి ఒక్కరూ గ్రామాలు పరిశుభ్రతపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని తాసిల్దార్ అరుణ కుమారి అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం ప్రతినెల మూడవ శనివారం నాడు నిర్వహిస్తున్న కార్యక్రమంలో తాసిల్దార్ పై విధంగా స్పందించారు. మండల అధికారుల ఆధ్వర్యంలో శనివారం చల్లపేట ,మీసాల పేట గ్రామాలలో స్వచ్ఛ్ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో అధికారులు మమేకమై గ్రామంలోని వీధులు, చెరువులు, కాలువలు శుభ్రపరచి స్వచ్ఛ ఆంధ్ర నినాదంతో ముందుకు సాగారు. ఈ సందర్భంగా తాసిల్దార్ అరుణ్ కుమారి మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాల ద్వారా గ్రామాల్లో పరిశుభ్రతపై చైతన్య కలుగుతుందని ప్రతి ఒక్కరూ శుభ్రత విషయంలో నిర్లక్ష్యం వద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో విమల కుమారి, వెలుగు ఏపిఎం అన్నపూర్ణ, పంచాయితీ సెక్రటరీ సిబ్బంది, వెలుగు సిబ్బంది ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. ..

అన్నదాత సుఖీభవ ప్రయోజనం అందరికీ చేరేలా చర్యలు

రైతు ఇంటికి వెళ్లిన జిల్లా కలెక్టర్ స్వప్నిక్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర-మందస: ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'అన్నదాత సుఖీభవ%-%పిఎం కిసాన్' పథకంలో ఒక్క లబ్ధిదారుడు మినహాయింపు కాకుండా అందరికీ చేరేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. మందస మండలం సువర్ణపురం గ్రామంలో శుక్రవారం ఆయన క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. గ్రామంలోని పలువురు రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి వారు పథకం కింద డబ్బులు అందుకున్నారా..లేదా ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఎవరైనా లబ్ధిదారు డబ్బులు పొందకపోతే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. "పథకం అమలులో ఎలాంటి లోపాలు లేకుండా పర్యవేక్షణ కఠినంగా ఉండాలి" అని స్థానిక అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా రైతులు పథకం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ స్వయంగా ఇంటింటికీ వెళ్లి వివరాలు తెలుసుకోవడంతో వారంతా ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. పర్యటనలో కలెక్టర్ పలువురు విద్యార్థులతో ముచ్చటించారు. వారి భవిష్యత్తు లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, తహసిల్దార్ శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.